క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు



ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. దమ్మాలపాడు గ్రామానికి చెందిన రైతు అడంగల్‌లో పేరు సవరణ కోరుతూ, అలాగే కుందురువారిపాలెం గ్రామంలో రహదారి సమస్య పరిష్కారం కోరుతూ అర్జీలు అందాయని చెప్పారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆట్యా–పాట్యా జిల్లా జట్టుకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



నకరికల్లు: క్రీడలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని దేచవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ సోమవారం తెలిపారు. ఆట్యా–పాట్యా జిల్లా జట్టులో తమ పాఠశాల విద్యార్థులు కె.బుజ్జి, మేఘన, యిస్మాయిల్‌లు స్థానం సాధించారని అన్నారు. ఆగస్టు 8, 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేరేందుకు ఈ నెల 31 తుది గడువు

ప్రిన్స్‌పాల్ సునీత



బెల్లంకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరేందుకు విద్యార్థులకు ఈ నెల 31తో గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో మండలంలోని మూడు జెడ్పీ పాఠశాలల్లో 170 మంది విద్యార్థులు పది పాసవగా 97 మంది కళాశాలలోనే చేరారని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం కళాశాలలో ఎక్కువ అడ్మిషన్లు జరిగినట్లు తెలిపారు. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారని, ఉత్తమ విద్యా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్లకు గడువు ముగుస్తుండడంతో ఇప్పటివరకు కళాశాలల్లో చేరని వారు, దూర విద్య ద్వారా పదవ తరగతి పూర్తి చేసిన వారు అడ్మిషన్లు పొందాలని కోరారు.

కందులవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు



సత్తెనపల్లి: ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని కందులవారిపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న నాలుగు సంవత్సరాల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి సత్తెనపల్లిని అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సమస్యలు తెలుసుకొని వాటిని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరు మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేట నుంచి గుంటూరు దిశగా ఆదివారం బుల్లెట్ వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తూ వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపురం కొత్త బైపాస్ వంతెనపై జరిగిన ఈ ప్రమాదంలో మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమకోటి శాస్త్రి, దండా గోపి, మరొక వ్యక్తి ఉన్నారు. తీవ్రగాయాలైన వీరిని గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో బీటెక్ విద్యను పూర్తి చేసిన దొప్పలపూడి హనుమకోటిశాస్త్రి (26) మృతి చెందినట్లు వైద్యులు సోమవారం ధ్రువీకరించారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా..!?



కంకర లేచి ప్రమాదకరంగా ఉన్న చాగల్లు–తొండపి రహదారి



చాగల్లు–తొండపి రోడ్డులో ఏర్పడ్డ గుంతలు

- అధ్వానంగా చాగల్లు–తొండపి రహదారి
- కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు, రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

నకరికల్లు: మండలంలోని చాగల్లు నుంచి ముప్పాళ్ల మండలం తొండపి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారయింది. రెండు గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు కంకరరాళ్ల మయం, గోతులమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా చేయాలని.. త్వరగా రహదారిని పూర్తి చేయాలని కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. వెట్‌మిక్సర్, కంకరు పోసి రోలర్‌తో చదును చేశారు. తారుపోసే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు అద్దాల్లా మారుస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. రోడ్డు నిర్మాణం కాదు కదా కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో వర్షాలకు గోతులమయంగా మారింది. కంకర మొత్తం లేచి ప్రమాదకరంగా మారింది. రెండు గ్రామాల వాహనాదారులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారిపడుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యే తరుణంలో రోడ్డు అధ్వానంగా ఉంటే రాకపోకలు సాగించలేమని రైతులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు బుక్స్, ఆట వస్తువులు అందజేత



నవోదయ ఎంట్రన్స్ బుక్స్, ఆట వస్తువులు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ కో ఫౌండర్ శివరాం

పెదకూరపాడు (అచంపేట): స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అచ్చంపేట మండలంలోని అచ్చంపేట, రోకలిగుంట పాలెం, పెద పాలెం దత్తత పాఠశాలలను ఫౌండేషన్ కో ఫౌండర్ కూరపాటి శివరాం (లండన్) ఆయన కుమారుడు అక్షర్ లక్ష్మీరామయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా యూకేలో 3వ తరగతి చదువుతున్న అక్షర్ తన పాకెట్ మనీతో పాఠశాల విద్యార్థులకు నవోదయ ఎంట్రన్స్ బుక్స్, ఆట వస్తువులు, టేబుల్ బుక్స్ అందజేశాడు. అక్షర్ తన అనుభవాలు విద్యార్థులు, ఉపాధ్యాయులతో పంచుకున్నాడు. నవోదయ ఎంట్రన్స్‌లో ప్రతిభ చాటి సీటు తెచ్చుకునే ప్రతి విద్యార్థికి 100 పౌండ్లు(రూ.10,000) గిఫ్ట్‌గా ఇస్తానని హామీ ఇచ్చారు. అచ్చంపేట, పెద్దపాలెం బడుల్లో మొక్కలు నాటి ఏటా తన వంతుగా ట్రీ ప్లాంటేషన్‌కు యూకేలో తన ఫ్రెండ్స్ నుంచి సపోర్ట్ కూడగడతానని చెప్పాడు. ఇటీవల ఇంగ్లాండులో నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో 8 దేశాల నుంచి విద్యార్థులు పోటీ పడగా చాంపియన్ షిప్ సాధించానని, స్నేహహస్తాలు ద్వారా అచ్చంపేట, బొల్లాపల్లి బడుల్లో కూడా అబాకస్ కోచింగ్ ఇప్పిస్తామన్నారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో హిస్టరీ, జియోగ్రఫీ–క్రీడలకి సంబంధించి రీసెర్చ్ చేయటం తన లక్ష్యమని అక్షర్ చెప్పాడు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా స్నేహహస్తాలు ఫౌండేషన్ మండలంలోని పాఠశాలలను దత్తత తీసుకొని విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేస్తుందని గత సంవత్సరం 100 కుట్టు మెషిన్‌లను పంపిణీ చేసామని, అచ్చంపేటలో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లా, బాబు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించి పర్యావరణం కాపాడాలి

పల్నాడు జిల్లా డీడీఏ శివకుమారి



నకరికల్లు: అన్నదాతలు తమ పంట పొలాలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా వనరుల కేంద్రం పల్నాడు జిల్లా డీడీఏ ఎం.శివకుమారి సూచించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025–26 రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని దేచవరం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పైరులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువుల ఎంపిక, చీడపీడల యాజమాన్యం సమర్థవంతంగా పాటించాలన్నారు. జీవన ఎరువులను క్రమ పద్ధతిలో వాడాలని, కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడకూడదన్నారు. పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఏవో కె.దేవదాసు, వ్యవసాయ సహాయకులు పి.పవన్‌కుమార్, రవిబాబు, హనుమంతరావు, రైతులు బంగారుబాబు, వెంకయ్య, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఉత్తర్ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు శ్రీహరి



పెదకూరపాడు: విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టపడి చదవాలని ఉత్తర్ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు మండడి శ్రీహరి అన్నారు. పెదకూరపాడు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గారపాడు, 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మోరల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యపై ఆసక్తి చూపుతూ మంచి విజ్ఞానాన్ని పొందాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది శ్రీహరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గారపాడు, 75 త్యాళ్లూరు ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

• గుంతను పూడ్చండి సారూ....



రాజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పడిన గుంత

రాజుపాలెం: గత వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో దాదాపు అడుగు లోతు నీళ్లు నిలబడడంతో చిన్నపాటి వాగును తలపిస్తుంది. దీని వలన ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బస్సు ఎక్కడానికి రోడ్డు పక్కనే నిలబడి ఉండడం వలన వచ్చిపోయే వాహనాలు గుంతలోకి రావడంతో ప్రయాణికులపై మురుగు నీరు పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులపై మురుగు నీరు పడడంతో మరలా ఇళ్లకు వెళ్లి బట్టలు మార్చుకొని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ గుంతను పూడ్చించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఈ నెల 31న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలన్నారు.

రైస్ మిల్లులో చోరీ

నకరికల్లు: స్థానిక శ్రీనివాస రైస్ మిల్లులో రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ సోమవారం తెలిపారు. నకరికల్లుకు చెందిన కాళంగి జ్వాలా నర్సింహారావు స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. జూలకంటి వెంకటేశ్వర్లు గుమాస్తాగా, యక్కల జ్వాలా నర్సింహారావు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి మిల్లులో కార్యకలాపాలు ముగించుకొని బీరువా తాళాలు టేబుల్ డెస్క్‌లో పెట్టి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం మిల్లుకు వచ్చి చూడగా మిల్లు వెనుక భాగంలోని తలుపు బోల్టులు తొలగించి గుర్తు తెలియని దుండగులు మిల్లులోకి ప్రవేశించి బీరువాలోని రూ.15 వేలు నగదు అపహరించారని తెలిపారు. నిర్వాహకుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలియజేశారు.

గ్యాస్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

సత్తెనపల్లి: రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ మేనేజర్ షేక్ ఆసియా పర్వీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ 16 సంవత్సరాల నుంచి రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో 18 మంది వర్కర్లు డెలివరీ బాయ్, ఆఫీస్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, గోడౌన్ ఇన్‌చార్జ్, వాచ్‌మన్, ఇలా వివిధ రకాల విధులు నిర్వహిస్తున్నారని, నేటికి కూడా పని భద్రత, ప్రభుత్వం ప్రకటించిన ఈఎస్‌ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు లేవన్నారు. చట్టప్రకారం ఇవ్వవలసిన జీతాలు కూడా లేవని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో కుటుంబ జీవనం సతమతమవుతుందన్నారు. ఇప్పటికైనా స్పందించి రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం ఎస్ ఫారం ఇచ్చి పని భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, లేబర్ యాక్ట్ ప్రకారం సెలవులు ప్రకటించాలని, ప్రభుత్వం ఇస్తున్న ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.వీరాంజనేయులు, కార్యదర్శి అంజిబాబు, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎన్.పోతురాజు, సాంబయ్య, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంబాల ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.

త్వరలో కెనాల్‌కు సాగునీరు

కావల్యాపురం: జలాశయాలన్నీ నిండు కుండలా తలపిస్తున్నాయని లింగంగుంట్ల ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి సోమవారం అన్నారు. డీఈ మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి 5 వేల క్యూసెక్కుల సాగర్ జలాలను మాచర్ల పరిధిలో ఉన్న బుగ్గవాగుకు నింపుతున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజనుకు సాగు నీరు కొరత లేదని రోజుల వ్యవధిలో మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న టువంటి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మాగాణి మెట్ట పంటలు రైతులు సాగు చేసుకోవచ్చునని తెలిపారు.

వాహనం ఢీకొని సైకిలిస్ట్ మృతి



మృతి చెందిన బీకం శ్రీనివాససింగ్

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని సైకిలిస్ట్ మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బొందిలిపాలెంకు చెందిన బీకం శ్రీనివాససింగ్ (60) వృద్ధుడు మండలంలోని పసుమర్రు సమీపంలోని తనకు చెందిన నివేశన స్థలాలను చూసుకుని పట్టణానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వాహనం సైకిల్‌ను వెనుక నుండీకొని నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధుడి సైకిల్ దూరంగా వెళ్లి పడి నుజ్జునుజ్జు కాగా, శ్రీనివాససింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చిలకలూరిపేట పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య సంభాబాయి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: పంటలు సాగు చేసే రైతులు బీమా చేయించుకోవాలని మండలం వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని గుడిపూడి గ్రామంలో పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) ద్వారా వాతావరణంలో వచ్చే మార్పులతో పంట నష్టం వాటిల్లితే రైతులను ఆదుకొనుటకు పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఖరీఫ్–2025 నుంచి అమలు చేస్తుందన్నారు. మండలంలో పత్తి పంటను సాగు చేసే రైతులు ఎకరాకు రూ.1,900 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టం కలిగినట్లయితే బీమా మొత్తం రూ.38 వేలు పొందవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు శాఖా ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునని, వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలన్నారు. బీమా ప్రీమియం చెల్లింపుకు 31 వరకు గడువు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా పప్పుధాన్యాలు, ఎండు మిరప పంటలకు 31వ తేదీ లోపు, వరి సాగు చేసే రైతులు ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. పప్పుధాన్యాలకు ప్రీమియం ఎకరాకు రూ.40 చెల్లించి బీమా మొత్తం రూ.20 వేలు, ఎండు మిరపకు రూ.360 చెల్లించి బీమా మొత్తం రూ.90 వేలు పొందవచ్చన్నారు. వరికి ఎకరాకు రూ.80 చెల్లించి బీమా మొత్తం రూ.40 వేలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు ఏ సుబ్బారావు, నింగయ్య, ఏఈవో జానీ బాషా, వీహెచ్‌ఏ శాంతి శ్రీ, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కుళాయిల్లో మురుగు నీరు



సరఫరా అయిన మురుగునీరు

అమరావతి: జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు లక్షల రూపాయలు మంజూరు అయిన మండల పరిధిలోని, ధరణికోట గ్రామ పంచాయతీ కుళాయిల్లో మురుగు నీరు సరఫరా అవుతుందని వైఎస్సార్‌సీపీ మండల సహాయ కార్యదర్శి దారా ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కృష్ణా నది పక్కనే ఉన్నా మురికి నీరు తాగుతున్నామన్నారు. గత వారం రోజుల నుంచి పంచాయతీ కుళాయిల ద్వారా రంగు మారిన మురుగు నీరు వస్తోందని, దీంతో నీరు కొనుక్కుని తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు తాగటం వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. జ్వరాలు, డయరియా మలేరియా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ అధికారులు నది నుంచి వచ్చే నీటిని ఫిల్టర్ చేసి శుద్ధమైన తాగునీరు అందించాలని కోరారు. అమరావతి నుంచి పైలట్ ప్రాజెక్టు ట్యాంక్ ద్వారా జైల్ సింగ్ కాలనీ ఇతర ప్రాంతాలకు కూడా మురుగు నీరు రావటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సహాయ కార్యదర్శి తోకల సూరిబాబు, రైతు సంఘం నాయకుడు ఆలపాటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు వివాదాస్పదం



ఎంపీడీవో కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలు

ముప్పాళ్ళ: మండల పరిషత్ కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా జాతీయ నాయకులు డాక్టర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు రోజు రోజుకి వివాదాస్పదంగా తయారైంది. పది సంవత్సరాల క్రితం మండల పరిషత్ కార్యాలయం స్థలంలో ఐదు గదులను నిర్మించారు. వాటి నిర్వహణ మండల పరిషత్ కార్యాలయమే చేపడుతుంది. ప్రతి రెండేళ్లకోసారి వేలం నిర్వహించి, దుకాణాలు అద్దెకు కేటాయిస్తారు. ప్రస్తుతం రెండు గదులు మినహా మిగిలిన గదులు ఖాళీగానే ఉన్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఇప్పటికే పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. పక్కనే కొంత ఖాళీ స్థలం ఉండటంతో అందులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల ఏర్పాటుకు ఎస్సీ సామాజిక వర్గం నేతలు కమిటీగా ఏర్పడి రెండు నెలల క్రితం భూమి పూజ చేసి నిర్మాణ పనులు చేపట్టారు. విగ్రహాలు ప్రారంభానికి సిద్ధమవుతుండగా ఎస్సీ సామాజిక వర్గంలో ఒకరు అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో విగ్రహాలు ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఎంపీడీవో కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. విగ్రహాలు దుకాణాలకు అడ్డుగా ఉంటాయని, అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావటం లేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తాత్కాలికంగా విగ్రహాల ఏర్పాటు నిలిచిపోయింది. ఈ క్రమంలోనే నిర్మాణ కమిటీ సభ్యులు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తితో రాతపూర్వక అభిప్రాయంతో ఎంపీడీవో కార్యాలయానికి అర్జీ అందించి తిరిగి పనులు ప్రారంభించి దిమ్మె పనులు పూర్తి చేశారు. అర్జీదారుడు జరుగుతున్న విషయాన్ని ఎంపీడీవో కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం రాత్రి జాతీయ నాయకుల విగ్రహాలను నూతనంగా నిర్మించిన సిమెంట్ దిమ్మెపై ఏర్పాటు చేశారు. జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో అనే ఆందోళన మండల వాసుల్లో నెలకొంది. అధికారులు సైతం జరుగుతున్న పరిణామాలతో సతమతమవుతున్నారు.

సత్తెనపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా వీరాంజనేయులు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ప్రెసిడెంట్‌గా బండ్లమూడి వీరాంజనేయులు ఎన్నికయ్యారు. 2025–26 సంవత్సరానికి ఎన్నికైన లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ నూతన కార్యవర్గం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ క్లబ్ టౌన్ ప్రెసిడెంట్‌గా బండ్లమూడి వీరాంజనేయులు, సెక్రటరీగా ముద్దా రమేష్‌బాబు, ట్రెజరర్‌గా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా పెద్దింటి వెంకటేశ్వర్లు, గుర్రం మహేశ్వరరావు, కె.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా తోట పద్మ, డైరెక్టర్లుగా ఎం.వెంకటేశ్వరరావు, కర్నాటి వెంకటరెడ్డి, పొత్తూరి రామకోటయ్య, తవిటి భావన్నారాయణ, వైపీ మురళీకృష్ణ, డి.శ్రీనివాసరావు, కె.విష్ణు, కొండవీటి రాజులచే సీనియర్ లయన్ కంబాల వెంకటేశ్వరరావు ఇండక్షన్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్ కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో–1 ఏ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ లయన్స్ సేవలు అభినందనీయమని కొనియాడారు. నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాల్లో భాగంగా షేక్ మస్తాన్‌వలి ఆర్థిక సహాయంతో పేదవారికి కుట్టు మిషన్, పేద మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవహార కర్తలుగా వైపీ మురళీకృష్ణ, మంచికంటి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ముందుగా స్వర్గీయ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 316 హెచ్ జిల్లా కేబినెట్‌లో 2025–26 సంవత్సరానికి పదవులు పొందిన లయన్ కంబాల వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వర్లు, కంకణాల విష్ణువర్ధన్‌రావు, తోట చిన్నసాంబశివయ్య, పొత్తూరి రామకోటయ్యలను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.